


# ధరావత్తు గల్లంతు

కొమ్మరాజు సీతారామరావు

మొదటిసారిగా చూసాను. ప్రభాత సమయం. మంచు కురిసి వెలసిన పచ్చికబయలు. హవాయ్ చెప్పులతో సుతారంగా, మంచు ముత్యాలను గడ్డి పూలపై తొక్కుకుంటూ పోతున్నది. అప్పుడప్పుడు వంగి గడ్డిపోచలను తుంపి, తన మెత్తని పెదిమలపై తాటించుకుంటూ హుందాగా సాగిపోతున్నది. ఎదురుగా అశోక చెట్లు, ఆమెను గుర్తించినట్లుగా తలలూపుతూ అహ్వానిస్తున్నాయ్. పూలు పొదలపై పొంచి పొంచి సరాగాలాడుతున్నాయి. ఏదో పువ్వు కోసి ముడుచుకుందామని అటు మళ్ళింది. అంతలోనే గర్వం నిండిన కళ్ళతో, ఏమిటో ఈ పిచ్చి పూలు నాకెందుకూ అనుకున్నదో ఏమో చటుక్కున ఇటు తిరిగింది అసలు అటువంటి ఆడదంటే నాకు చాలా ఇష్టము. లాన్‌లో తోటమాలి వూడుస్తూనే తప్పుకున్నాడు. హోటల్ బాయ్ నమస్కరించి ఎటో వెళ్ళాడు. పూల మధ్య బాటలో నడిచేది కాస్తా, తోటకు అడ్డంపడి తన రూం చేరుకున్నది.

మొదట్లో పసికూనలాగ చిన్న గుట్టల మధ్య, దేవుడు ఆడి పారేసిన రాళ్ళ మధ్య, వుదయించిన ఆ ప్రాజెక్ట్‌హవుస్, పాపలాగే పాకుతూ, రోజు రోజుకు పెరుగుతూ, నాగార్జునసాగర్ పూర్తయే టప్పటికి, యవ్వనంలో వూగుతున్న మగువలాగ తయారైంది. ఆ ప్రాంతాలలో అనువైన రెస్ట్‌హౌస్ అది ఒక్కటే. ఇటు మాచర్ల వదిలితే, అటు హైద్రాబాద్‌వరకు అంత చక్కటి అనువైన విశ్రాంతి భవనాలు ఎక్కడా లేవు కూడ. కంపెనీ పనిమీద తరచు అక్కడకు రావటంవల్ల, అక్కడ ప్రతి అణువూ ప్రతి కణమూ, నాకు బాగా తెలుసు. కిటికీ తెర తొలగించి, చూడ గానే—ఆమె అట్లా కనిపించింది.

అసలు అంత అందగత్తేమీకాదు కూడ. అట్లా అని మరీ ధనాసరి సరుకు కూడ కాదు. నడకలోని హుందాతనం, పయిటలోని పరువం, ఆకట్టుకొనే అకారమే. రంగు ప్రమేయం లేకుండా ఒక్కసారి చూడగానే ఫర్వాలేదనిపిస్తూ మళీ చూడాలనిపిస్తుంది ఆమె సోయగం. నలుపులాంటి ఛాయ. అసలు ఆ మాట కొస్తే, ఏ రంగు విలువ, అందం, ఆ రంగుదే.

బెడ్ టీ తెచ్చి రూంబాయ్ బల్లమీద పెట్టగానే ప్రాణం లేచివచ్చింది. రెండు గుక్కల్లో తాగేసి 'కాల్‌గేట్' నోటబెట్టి, బాత్‌రూం వైపు వెళ్ళాను. మళ్ళీ ఫ్రెష్ టీ ఆర్డరిచ్చి, వరండాలోకి రాగానే ఎదురుగా ఆమె—

లాన్ మధ్యలో చల్లని నీడలో కుర్చీ వేయించుకుని, మొగుడు కామాల్ను, ఏమిటో అంటుంటే నవ్వుతున్నది. మధ్య మధ్యలో పేడ్‌మీద ఏమిటో రాస్తున్నది. అతనువంగి అతిదగ్గరగా ఏదో గొణుగు తూనే వున్నాడు. వారు ఆనంద సముద్రంలో తేలియాడుతున్నారు. నాలో ఏ మూలో అగ్ని రగుల్కొంది. అంద మైన ఆమె నీలికురులు, ఆ చల్లనిగాలిలో మెల్లగా ఎగురుతుంటే ముద్దొస్తున్నాయి. బహూశా ట్రావెలింగ్ వుద్యోగంతో విసిగి, భార్యకు దూరంగా తప్పనిసరిగా, తిరుగుతున్న నాకు ప్రతిదీ అందంగానే కనిపిస్తున్నదేమో?

తర్వాత రెండు మూడు రోజులు నా గొడవలో నేవుండటంవల్లనేమో—మరీ ఆమెను అంత ఇదిగా గమనించలేదు. ఆ సాయంత్రం ౬ గంటలకు ఆఫీసులలో పని దాదాపు సాంతం పూర్తిచేసుకొని వచ్చాను. రూంకి పోకుండానే, కామన్ డైనింగ్‌హాల్‌కి వెళ్ళి కోకాకోల సిప్ చేసి వరండాలోకి రాగానే, ఎదురుగా ఆమె-దాదాపు అతి దగ్గరగా— ఆమె నన్ను గమనించినట్లు లేదని నేననుకోను. నా చూపులకు ఆమె అయస్కాంతమని ఆమెకూ తెలుసు. కాని ఒక మగవాడు, తననే కొలుస్తున్నాడని తెలిసి కూడ కేర్‌నాట్‌గా, ఎంతో ఈజీగా ప్రవర్తిం

చటం, ఆడవాళ్ళ సొమ్ము. కాని శైలజ మాత్రం ఆ రాచఠీవితోనే, ఆ హంస నడకలోనే అటుగా సాగిపోయింది. నన్ను, నన్నుగా కాక, ఆ వరండాలోని స్తంభాలలో ఒకటిగా చేస్తూనే, చూస్తూనే. నాకు మాత్రం, రెచ్చగొట్టే ఆమె ప్రవర్తన మాత్రం, భరించరానిదిగా తయారైంది. అది మరీ నన్ను ఆమెకు దగ్గరగా ఈడ్చుకెళుతూనేవున్నది.

రూంకు వెళ్ళి, వేడినీళ్ళ స్నానం చేసి, బ్రిల్‌క్రీం రుద్దుకుంటూ, ఒకచేత్తో దువ్వెనతోనే, కిటికీ కర్టెను ప్రక్కకు నెట్టా. దూరంగా పున్నాగ, పొగడ నీడలో మెరసిపోతున్నది ఆమె— ఆ రెండు చెట్లూ కలసి మెలసి, పెన వేసుకున్న ఆత్మబంధువుల్లా—విడదీయ లేని స్నేహితుల్లా, ప్రాజెక్టుకు వచ్చిన ప్రతివారికి అనిపిస్తాయి. సాయంనీడలలో ఆ చెట్లు సోయగాలు, గుభాలింపులు— ఆమె చేరికతో మరీ షోకు పోతున్నాయి. నెమ్మదిగా వరండాలోకి వచ్చి, అటే చూస్తున్నా. నన్ను చూచినట్లుంది. అలవోకగా వొంగి పున్నాగ పువ్వును తీసుకునిఎడమచేతితో గిరగిరా త్రిప్పుతూ పొగడ పువ్వును, తన కురులలో ఎడమ వైపు, కొంచెం చెవికి దగ్గరగా క్లిప్పులో పెట్టుకుంది. దూరంగానే రావటం గమ నించినట్లుంది. ఒక్కసారి కళ్ళు చికిలించి, బల్లినీ, కప్పనూ చూచినట్లు చూసి, తనరూం వైపుకు సాగిపోయింది.

మర్నాడు శైలజ కనపడకపోతే, బహుశా రూం ఖాళీచేసి వెళ్ళారేమో అని అనుకున్నాను.

ఇంతలో 'రూంబాయ్' నా వాలకం కనుక్కొన్నట్లున్నాడు. "సార్! ఆమె వెళ్ళలేదు సార్. రూం లోపల వేసుకుని ఏంచేస్తున్నారో ఏమో!" అంటూ పక్కలు దులపటం మొదలుపెట్టాడు.

"రాత్రి, వారిద్దరూ ఏదో కీచులాడు కున్నారు సార్. చీకటితో లేచి చూస్తే ఆయన వెళ్ళిపోయారు సార్. హోటల్ బిల్లు కూడ కట్టలేదు సార్. పాపం బయటకు రాలేక రూంలోనే వుండి పోయిందామె, సార్" అంటూ దీర్ఘాలు తీస్తున్నాడు.

"భార్యను వదిలి ఎక్కడకు పోతా డోయ్! అందులోనూ, హోటల్స్‌లో ఒంటరిగా ఇలా వదలి ఏ భర్తా పోడోయ్" ఆవేశంగా అనేశాను.

పెళ్ళికి ముందే వారిద్దరూ ప్రేమించు కున్నారట సార్. ఒకే కంపెనీలో ఆయన సేల్స్‌మెన్, ఆమె టైపిస్టు. పెళ్ళి కాకముందు కూడ, ఇద్దరూ కలిసే వచ్చేవారు సార్. మొన్న ఆయనకు ప్రమోషన్ రాగానే, ఈమెను తన పి.ఎ. గా వేసుకున్నారట సార్. ఇక కలిసే వస్తున్నారు సార్."

నేను అయోమయంగా ఏంటో ఆలోచిస్తున్నా.

"మా మేనేజరుగారు బిల్లు కట్టేంత

వరకు ఆమెను ఖాళీచెయ్యనియ్యనని, ఖచ్చితంగ అంటున్నారు సార్."

నాలుగు రోజులు గడిచినాయి. అయినా రాలేదు. ఆమె గది విడచి బయటకు రావటమే మానేసింది.

"ఏయ్ జానీ. ఆమె సంగతి ఎలా వుంది?" పలకరించాను రూంబాయ్‌ని!

"ఏమిటో సార్ తనలో తానే కుమిలి పోతున్నారు. ఏమీ సరిగ్గా తినటంలేదు కూడా." కాజువల్‌గా అన్నాడు.

ఒక్కసారి మెరుపులాంటి ఆలోచన తళుక్కుమంది. ఒక కవర్‌లో 300 రూపాయలు పెట్టి, బాగా అంటించి, జానీ కిచ్చి, ఆమెకు వెంటనే ఇచ్చిరా అన్నాను.

వాడు షాక్ తిన్న మొహంపెట్టి, ఏదో అనేలోగానే, వాడి చేతిలో 5 రూపాయల నోటు కుక్కేసాను. బాణంలా దూసుకుపోయాడు. కిటికీలోంచి చూస్తున్నా. ఆమె తలుపు తెరవటం, కవరు అందుకోటం స్పష్టంగా చూచాను. కళ్ళు తిరిగినట్లుగా వుంది. చెమటలు కారటం కూడ ఆగలేదు, గబగబా నా రూంకి వచ్చి, ఎడాపెడా పెట్టుందేమో నని. కాని గంటా, రెండు గంటలు గడచినా, ఆమె బయటకు వచ్చే సూచనలే కనిపించలేదు.

ఇంతలో జానీ ఎవరికో లంచ్ తీసుకుపోతుంటే, ప్రశ్నార్థకంగా చూచాను.

వాడు నవ్వి, పండే సార్, అరవకుండా తీసుకున్నార్ సార్. అంటూ సాగిపోయాడు.

కవరు అందుకోగానే, శైలజ నా గది ముందర వాలి "ఎంత సాయం చేసారండి. మీ........"

"నా పేరు శ్రీకాంత్— అందరూ శ్రీ అనే అంటారు."

"కాని ముక్కూ మొహం తెలియని వారి దగ్గర ఎలా తీసుకోమంటారు చెప్పండి." గోముగా అన్నది.

"ఫర్వాలేదు. కష్టము మీ కొస్తే ఒకటి, నాకు వస్తే మరొకటీనా" సూది లాంటి చూపుతో అనేశాను.

సు తా ర ం గా కళ్ళు రెపరెప లాడించింది.

"అందులోనూ అందమైన ఆడవారు అపదలో వుంటే నేనసలు వూరుకో లేనండీ."

"కాని శ్రీకాంత్‌గారూ...."

"అబ్బ. కాంత్ అంటే చాలండీ...." అంటూ కొంటె కోపం నటించా.

"మీ భర్త చేసిన పని, ఎవరు మాత్రం హర్షిస్తారనీ. అసలు అతను మనిషేనా అని" కొంచెం సీరియస్‌గా అంటూ.... ఆమె దగ్గరగా జరిగాను. అంతే ఈజీచైర్‌లోంచి దొర్లి కిందపడ్డా. ఊహాలోకం, ఊకదంపుడు అయి పోయింది.

కలఅయితే మటుకు ఏం! కమ్మటి అనుభూతి.

సాయంకాలం అయింది. మాలి లాన్‌కు నీళ్ళు పెడుతున్నాడు. చల్లటిగాలికి కొంచెం కిటికీ కర్టెన్ తప్పించి చూసాను. శైలజ ఏమీ జరుగనట్లే మామూలుగా పొగడపూలు పడుతున్నది. జాని'ఏమిటో అంటున్నాడు. ఆమె నవ్వుతున్నది. ఏమిటోయ్ జానీ! గుడ్‌న్యూస్........'

నిన్న బిల్లు కట్టారుకదండీ. ఈ రోజు ఖాళీచేసి వూరుకెళ్ళిపోతారుటండీ. ఆమెకు వారినుంచి ఈరోజే యం. ఒ. కూడ వచ్చింది సార్. నాకు 5రూ. టిప్స్ ఇచ్చారు సార్."

బహుశా ఆమె ఉద్దేశ్యము నన్ను తొందరగా రంగంలోకి రమ్మనమనట మేమో. ఎంతయినా ఆడదికదా! తనకై తాను ఎట్లా ముందుకు దూకగలదు. అందు కని దొంకతిరుగుడుగా, నన్నే తన రూంకు రమ్మని సందేశమిచ్చినట్లుగా వుంది. కొంచెం చీకటిపడగానే, ఎవరూ చూడ కుండా ఆమె రూం తలుపు నెమ్మదిగా నెట్టాను. తీసే వున్నట్లుగావుంది. ఇక సంతోషం పట్టలేక ఒక్కసారి తోసుకు వెళ్ళి, లోపల గడియవేసి, లైటువేశాను. అడుగు ముందుకు పడలేదు. నోరు తడి ఆరిపోయింది. ఏముంది అక్కడ. వాడిన పొగడ పూలు— నలిగిన దుప్పట్లూ తప్ప. అంటే ఖాళీ చేసిందన్నమాట. ఎంత ఘోరం. అసలు ఈ ఆడజాతే అంత. కసిదీరా తిట్టుకున్నా. ఇంతలో జానీ వచ్చాడు, రూం చిమ్మి తాళం వేసుకోను. వాడి ముఖం ఎలా చూడటం. వాడిన వంకాయ మొహం పెట్టుకుని రూంలోంచి బైటకు రాగానే, జానీ "సార్! ఇక్కడ మీకేదో వుత్తరం పెట్టుంది సార్" అంటూ కవర్ అందించాడు. మళ్ళీ వెయ్యేనుగులబలం వచ్చింది. పరుగులాంటి నడకతో నా రూంలోకి వెళ్ళి జాగ్రతగా కవరుచించి, చదవుతున్నా....

"ఒరేయ్ శ్రీ....ఆపదలో వున్నంత మాత్రాన్న అందవికారి అయినంత మాత్రాన్న —ఏ ఆడదీ కేవలం డబ్బు కోసం కక్కుర్తిపడదురా అంటే పందెం అయిదువందలు కట్టావు. ఆ శైలజ ఎవరనుకున్నావు. నా కజన్. ఖరోడా. కాకతాళీయంగా, నీ విషయం వాకబుచేసి, నాకు డబ్బు పంపరా అవసరం అంటూ వ్రాసిన వుత్తరంలో రాసింది. మొదట్లో నీవనుకోలేదు ఆ హీరోవి. అందుకని ఆ ప్రసక్తి లేకుండా యం. ఒ. పంపాను, హోటల్ బిల్ కట్టాలంటే. దాని వుత్తరంలో విషయాలు, పోలికలనుబట్టి, నీవేనని నిర్ణయించుకొని వ్రాస్తున్నా. పాపం, ఆ అయిదువందలే కాక, ఈ మూడొందలూ పోయినాయి కదూ! బాధపడకురా— దేశం ఇంకా పూర్తిగా చెడిపోలేదని...." రమణ వ్రాసిందది.

"........వారు త్రిముఖ పోటీలో ధరావతు గోల్పోయారు........"

రేడియో వాగుతున్నది.

———